# బొమ్మలు

-నల్లబాటి రాఘవేంద్రరావు

ధర్మారావుకి పెళ్ళి చూపులు. తన ఊరు వైజాగ్ నుండి వచ్చి కోటిపల్లి వెళ్ళడానికి రామచంద్రాపురంలో బస్సు దిగాడు. అతనికూడా బంధువర్గం చాలామంది ఉన్నారు. కోటిపల్లి బస్సు రావడానికి టైం ఇంకా కాక పోవడంతో ఆ బస్టాండు చుట్టూ కలియతిరుగు తున్నారు.... వాళ్ళంతా.

ధర్మారావు సడన్‌గా ఒక దృశ్యం చూస్తూ ఉండి పోయాడు.

పండుటాకులా ఉన్న ఆ ముసలావిడ బంగారు రంగు శరీరంతో, ముఖాన రూపాయి బిళ్ళంత ఎర్రని కుంకుమ బొట్టుతో మెడలో రకరకాల పూసల దండలతో, చేతినిండా రంగురంగుల గాజులతో, ముగ్గు బుట్టలాంటి తలవెంట్రుకలతో, తల చిన్నగా ఊపుతూ, శరీరం మొత్తం చిన్నిచిన్ని మడతలతో, క్షణక్షణానికి కళ్ళు మూసి తెరస్తూ... అక్కడున్న రెండు పెద్ద ఎలక్ట్రిక్ స్తంభాల నడుమ నివాసం చేసుకొని కూర్చుంది. చేతిలో చిన్నజూకతో నేలమీద కొడుతూ, కంచంలో డబ్బులు గలగలలాడిస్తూ అడుక్కుంటుంది! ఆమెకు ఎండావానా పడకుండా రెండు మూడు తాటాకులతో ఎవరో పందిరి లాంటిది వేసి పుణ్యం కట్టుకున్నారు. ఆ తాటాకుల్లో దూర్చిన చిన్నగుడ్డల మూటే ఆవిడ ఆస్తిపాస్తులు!!

ఆవిడ వివరాలు అడిగాడు పక్కనే ఉన్న బడ్డీకొట్టు అతన్ని ధర్మారావు.

"ఎక్కడ్నించి వచ్చిందో ఇక్కడెవరికీ తెలియదు సారూ. పుష్కరం నుండి చూస్తున్నాం... "ఇదే రూపం!' మార్పులేదు.! పోయిన వడగాల్పులకే బాల్చీ తన్నేయాలి. ఎలాగో బ్రతికేసింది. 'ఇంకెన్నాళ్ళో బ్రతకవు. రేపో ఎల్లుండో పోతావు' అంటూ అందరం వేళాకోళం చేస్తుంటాం. 'సుబ్బయ్యమ్మా' అంటూ పలుకరిస్తూ డబ్బులు వేయండి. 'మనవడా' అంటూ ఎంతో ఆప్యాయంగా మాట్లాడుతుంది"

అతని మాటలతో ధర్మారావు తన జేబులోంచి రూపాయి బిళ్ళతీసి ఆమె బొచ్చెలో వేస్తూ "సుబ్బయ్యమ్మా, ఓ మామ్మా... నీ వయసెంత?" అంటూ అడిగాడు.

"మనవడా, ఇలారా కూర్చో... అరవై పైనే ఉంటాయి" అంటూ వణుకుతూ చెప్పింది.

"అదృష్టవంతురాలివి. ఇంత వయసొచ్చినా ఎవరూ సాయం లేకుండా, ఏ రోగం లేకుండా కనీసం ఇల్లు కూడా లేకుండా..."

"నిజమే... మనవడా నాకెవరూ లేరు. ఏ జబ్బు రాలేదు. నాకు దేవుడే దిక్కు. నారుపోసిన వాడు నీరు పొయ్యడా... తింటానికేదయినా పెట్టు మనవడా..."

"సరే, ఈ రెండు రూపాయలతో అరటి పళ్ళు కొనుక్కో. నా పేరు ధర్మారావు. కోటిపల్లి సంబంధానికి వెళ్తాన్నాం. అమ్మాయి కుదిరిందనుకో, నీకు పప్పన్నం! ఇలాగే మామగారింటికి వెళ్తుండాలిగా అప్పుడుప్పుడు నీ దగ్గరకొచ్చి కనబడతానుగా. అయినా నువ్వు రేపో ఎల్లుండో 'హుష్‌కాకి' అయిపోతావట!" ధర్మారావు పెద్ద జోకు వేసినవాడిలా తనలోతానే నవ్వేసుకున్నాడు.

ఆ తర్వాత ధర్మారావుకి కోటిపల్లి సంబంధమే కుదరటం.. గుణవతి అనే అమ్మాయిని భార్యగా పొందటం.. పెళ్ళి, 16 రోజుల పండుగ, సంక్రాంతి,. ఉగాది, ఆషాడం, శ్రావణం... అత్తారింటికి వెళ్ళి వచ్చే ప్రతిసారీ బస్టాండులో సుబ్బయ్యమ్మని కలవటం ధర్మారావుకి అలవాటైపోయింది.

అంతేకాదు వైజాగ్ నుండి తను వచ్చి రామచంద్రాపురంలో దిగగానే కోటిపల్లి బస్ సిద్ధంగా ఉన్నా ధర్మారావు ఎక్కడు. ఆ విషయం తెలిసిన గుణవతీ కంగారు పెట్టదు. 'ముందు మీ మామ్మని కలిసి రండి తర్వాత బస్ ఉందోలేదో చూద్దాం" అనేది. మరో విషయం 'మామ్మా, బాగున్నావా సుబ్బయ్యమ్మా..' అని ధర్మారావు పలకరించే సరికి 'నా మనవడివి - ధర్మారావువి' అంటూ గుర్తుపట్టేది సుబ్బయ్యమ్మ. ఇక ధర్మారావు అక్కడున్న ఇద్దరుముగ్గురు బడ్డీ వ్యాపారస్తులకు తన ఫోన్ నెంబరు కూడా ఇచ్చాడు. సుబ్బయ్యమ్మకు ఏదయినా జరిగితే తనకు కబరు చెయ్యమని... మనవడిగా తాను ఆమె అంత్యక్రియలు తన ఖర్చులతో చేస్తాననీ... చెప్పాడు

2

ఆరోజు ధర్మారావు భార్యా, ఇద్దరు పిల్లలతో బస్ దిగాడు. అబ్బాయి రవిబాబు, అమ్మాయి మల్లిక. సరాసరి సుబ్బయ్యమ్మ దగ్గరకెళ్ళారందరూ. రవి బాబుకి 5 ఏళ్ళు. తండ్రి ఇచ్చిన 5 రూపాయల బిళ్ళ. సుబ్బ

య్యమ్మ కంచంలో వేసాడు. మల్లిక తనూ మరో రూపాయి వేసింది.

"మామ్మా, ఆరు ఏళ్ళ నుండి ఇలాగేఉన్నావు. నీలో ఏమార్పులేదు. నేనుచూడు అప్పుడే తెల్ల వెంట్రు కలతో ఎలా అయిపోయానో" అన్నాడు ధర్మారావు నవ్వుతూ.

గుణవతి నవ్వేసింది భర్త తలలో తెల్లవెంట్రుకలని లాగిపారేస్తూ.

పిల్లలు సుబ్బయ్యమ్మని చిత్రంగా చూసారు. ఆ తర్వాత అందరూ కలిసి బస్సెక్కేసారు.

"గుణవతీ, ఈ మామ్మా... మళ్లీ మనం వచ్చేసరికి కనిపిస్తుందోలేదో, పెద్ద వయసు"

"పాపం అలా అనకండీ"

"ఎందుకు కనబడదునాన్నా ఈ మామ్మా...?"

"చచ్చిపోవచ్చురా. చాలాపెద్దవయసు. మళ్ళీ చూపించమంటే చూపించలేనురోయ్! ఏ ఆదరణ లేదు. సాకే రక్త సంబంధీకులు లేరు - ఎండకు ఎండాలి, వానకు నానాలి... ఇలాంటి వాళ్ళు బ్రతుకరు మరి! ఈ కిటికీలోంచి చివరగా చూడరా రవిబాబూ... అమ్మా మల్లికా నవ్వు కూడా..." బస్సు కదిలింది.

3

"పెళ్ళి చేసుకోవడమే మహాపాపం! అనుకున్నట్లు అన్నీ జరగొద్దూ. ఇదేంటని అడిగితే గొడవలు. మా ఆవిడను బలవంతంగా తీసుకొచ్చేసారు కోటిపల్లి. నేనిప్పుడెళ్ళి పంపమంటే 'పెద్దలను తీసుకొచ్చి, సమస్య పరిష్కరించుకొని నీ పెళ్ళాన్ని తీసుకెళ్ళు' అంటున్నారు. ఛి ఛీ, దానిముఖం ఈ జన్మలో నేను చూస్తానా? నేను చచ్చేలోపు ఈ కోటిపల్లే రాను. మామ్మా, అదికాని ఎప్పుడైనా ఈ బస్టాండులో దిగి నీ దగ్గరకొస్తే... బుద్ధి చెప్పు. భర్త రమ్మన్నప్పుడు వెళ్ళిపోవాలన్నా జ్ఞానం లేదా అని అడుగు. నీకోసం ఇక ఆయన రాడూ. నువ్వే పిల్లలతో వెళ్ళిపోయి బుద్ధిగా కాపురం చేసుకో అని గడ్డిపెట్టు. పిల్లలకేం పర్వాలేదు. అక్కడో ఇక్కడో ఎలాగోలా చదివేస్తారు. ఈ గొడవలన్నీ సద్దుమణగడానికి పది సంవత్సరాలు పట్టిందనుకో.. లిక్కు లిక్కుమంటూ అప్పుడావిడ వస్తే... కరిగిపోయిన యవ్వనం తిరిగొస్తుందా!! నువ్వే చెప్పు. సుబ్బయ్యమ్మా, దానికి ఆ మాత్రం ఇంగితం ఉండొద్దూ!

అసలే మా ఇంటిదగ్గర అన్నదమ్ములతో ఆస్తి తగాదాలు. ఒకపక్క ఉద్యోగంలో అధికారులతో ఒడిదుడుకులు. సమస్యలతో భారంగా జీవితం గడుస్తుంటే ఈవిడగారి సమస్యొకటి! కొత్తగా వచ్చిపడింది! వినబడుతుందా, నే చెప్పే 'మాటలన్నీ' చెప్తావా లేదా? చచ్చినా రాజీకి మగవాడు రాడు. ఆడదే దిగి రావాలని ఆవిడగారికి చెప్తావాలేదో? నిన్నే

" ఎవ...రూ...??"

"ధర్మారావుని"

'నువ్వా నాయనా, నా మనవడూ ధర్మారావూ... బాగున్నావా. నాకీ మధ్య సరిగా వినబడడం లేదు,

**నివాళి :**



## వి.ఆర్.బొమ్మారెడ్డి అస్తమయం

ప్రముఖ పాత్రికేయులు బొమ్మారెడ్డి వెంకటేశ్వరరావు అక్టోబరు 13, శుక్రవారం తన 90వ ఏట కన్నుమూశారు. కొంతకాలంగా అస్వస్థులుగా వున్న బొమ్మారెడ్డి, విజయవాడ కస్తూరిబాయిపేటలో వున్న తమ స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. ఈయనకు భార్య, కుమారుడు, యిద్దరు కుమార్తెలు వున్నారు.

విద్యార్థి దశలో సోషలిస్ట్ భావాలకు ప్రభావితులైనారు. మద్రాసులో బి.ఎ. చదువుతున్నపుడు నేషనల్ పత్రిక ప్రభావంతో కమ్యూనిస్టు వుద్యమం వైపు మరలారు. 1945లో ప్రజాశక్తి దినపత్రిక సంపాదక వర్గంలో చేరారు. తర్వాత జనత, జనవాణి పత్రికలలో పనిచేశారు. విశాలాంధ్రలో 12 సంవత్సరాలకు పైగా పనిచేసిన బొమ్మారెడ్డి సిపిఎం ఏర్పడిన తర్వాత జనశక్తిలో చేరారు. దాదాపు 52 సంవత్సరాల పాటు కమ్యూనిస్టు పార్టీ పత్రికలకు తమ సేవలను వుచితంగా అందించారు. 1997లో వయోభారంతో ప్రజాశక్తి నుంచి వైదొలగినా, రచనా వ్యాసంగానికి స్వస్తి పలకలేదు. నార్ల పేరిట నెలకొల్పిన విశిష్ట జర్నలిస్టు అవార్డును ప్రప్రథమంగా బొమ్మారెడ్డి అందుకున్నారు. బొమ్మారెడ్డి క్రమశిక్షణ గల కార్యకర్తగా ఆశయ నిబద్ధుడుగా, పలువురి ప్రశంసలు అందుకున్నారు. వారి మరణానికి పత్రిక ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తంచేస్తూ, నివాళులర్పిస్తోంది. ■

కళ్ళు మసకబారినియ్... నువ్వేదో అంటున్నావా?!'

"సర్లే, నీ వయసైపోయింది. రేపో ఎల్లుండో లాగు న్నావు. నా సమస్య నీ దగ్గర చెప్పటం నాదీ బుద్ధి తక్కువ!" ధర్మారావు విసురుగా వెళ్ళిపోయి, వెనక్కు వచ్చి రెండు రూపాయల బిళ్ళ కంచంలోకి గిరాటేసి స్పీడుగా వెళ్ళిపోవాలని సైకిలెచాడు.

'నా మనవడు ఎంత మంచోడో..." డబ్బులు తీసుకుంటూ అన్న సుబ్బయ్యమ్మ మాటలు అతనికి నెమ్మదిగా వినబడ్డాయి"

"అవును, నేను మంచోడినే, ఈ సమాజమే అర్థం చేసుకోవటం లేదు...." గొణుక్కుంటూ ముందుకు సాగి పోయాడు ధర్మారావు.

4

దశాబ్దకాలం గతించిపోగా ఆరోజు... ధర్మారావు భార్యతో, పిల్లలతో కోటిపల్లి వెళ్ళడానికి రామచంద్ర పురంలో బస్సు దిగాడు.

"ఇదిగో, సుబ్బయ్యమ్మా... బాగున్నావా? మా ఆవిడతో గొడవలు సద్దుమణిగాయి. పంతాలు.. పట్టింపులు... కోర్టులతో... తొమ్మిదేళ్ళు గడిచిపోగా సంవత్సరం క్రితం మా మామగారు, పెద్దలువచ్చి మా ఆవిడను వైజాగ్‌లో మా ఇంటిదగ్గర దిగవిడిచి వెళ్ళారు. ఇదిగో మళ్ళీ ఇప్పుడే కోటిపల్లి వెళ్తున్నాం... నేనూ ధర్మారావుని... గుర్తురాలేదా?"

"మనవడూ... ధర్మారావు, నాయనా..."

"ఇదిగో వీడు మా అబ్బాయి రవిబాబు. ఆనవాలు లేకుండా పొడుగైపోయాడు చూడు. పదో తరగతి, ఇది మా అమ్మాయి మల్లిక 9 చదువుతుంది. నా భార్య గుణవతిని చూడు, పళ్ళన్నీ ఊడిపోయి, నీకన్నా ముసలి దానిలా తయారైంది చూడు. నువ్వు మాత్రం అలాగే ఉన్నావు... ఏమిటి? వినబడుతుందా?"

"ఈ మధ్య బాగానే వినబడుతుంది, కనబడు తుంది మనవడూ..."

"ఏం మందులు వాడుతున్నావేంటి?"

"నా ముఖానికి మందులొకటా?"

"అవును, ఇక్కడ కర్రలు, పైనతాటాకులు లేవేంటి?"

"మొన్న సిఎం గారొచ్చారనీ పీకేసారు బాబూ"

"మరెలా?"

"ఇవిగో నాలుగు గెడలు, నాలుగు తాటాకులు సంపాదించాను. రాత్రికి... ఆ రిక్షావాళ్ళు.. వేస్తాన న్నారు".

" ఏ.. ఆయాసపడుతున్నట్టున్నావ్?"

"అప్పుడప్పుడు.. ఏవో వస్తూ వుంటాయి, పోతూ వుంటాయ్.. మామూలే..."

"సరే, ఈ పది సంవత్సరాల్లో నాకెన్ని సమస్య లొచ్చాయో చెప్పనా! నాకు బి.పి., షుగర్... మా ఆవిడకు ఆయాసం.. ఆ మధ్య నేను హైదరాబాద్ పని మీద వెళ్ళివస్తుంటే... నాకు ఏక్సిడెంటు అయింది. రెండు మూడు లక్షలు వదిలాయి - వింటున్నావా...

"వింటున్నాను మనవడా..."

"ఏంటో... అంతా నీకు చెప్పాలనిపిస్తుంది. ఉద్యో గం పోయింది. కాంట్రాక్టులు చేస్తున్నాను. నాన్నా, అమ్మా, మామయ్య, అక్కబావ... మా వాళ్ళు చాలా మంది కాలం చేసారు. ఇప్పుడందరిలోకి నేనే పెద్ద. ఏమిటలా చూస్తున్నావ్? ఈ పొట్టా?! వద్దన్నా పెరిగేది ఇదేకదా!? ఏమిటో బానలా తయారైంది. చత్వారపు కళ్ళజోడూ తప్పలేదు. అవునూ నీకు చత్వారం లేదా?"

"వచ్చి తగ్గిపోయినట్టుంది... ఇప్పుడు బాగుంది. ఈ గొడవలన్నీ తగ్గించుకో మ...న...వడా.." వణుకుతూనే అందామె.

"అదే ప్రయత్నంలో ఉన్నాను. కాని ఎక్కడ తగ్గు తాయి. పెరుగుతున్నాయి. పది పదిహేను లక్షలతో బిల్డింగ్ కట్టి, నాలుగురాళ్ళు వెనకేసుకొని ముసలి వయసులో వీధి పాలు కాకుండా హాయిగా బ్రతకాలనే గట్టి ప్రయత్నం చేస్తున్నాను. అలాజరగకపోతే ఇదిగో నీలాంటి బ్రతుకు బ్రతకాలి" "అలా డబ్బు సంపాదించ డం కోసం 12 కేసులు కోర్టులో వేయవలసొచ్చింది. బ్రతుకుంతా కోర్టుల పాలు... ఛి ఛీ...."

"పోనీలే, నువ్వె..వరి మీద తప్పుడు కేసు... పెట్ట లేదుగా"

"చెప్పేదదేగా తప్పుదు. బిల్డింగ్ కట్టాలంటే మా ఇంటి వెనుక శాస్త్రిగారి స్థలం నాకు కలవాలి. ఆయన్ని మామూలుగా అడిగితే ఇవ్వడు - తప్పుడు కేసుపెట్టి భయపెట్టి బెదరగొట్టి కోర్టుల చుట్టూ తిప్పితే హడలి పారిపోయాడు. తప్పదుగాక తప్పదు - ఇదంతా చెప్పినా నీకు అర్థంకాదు. మరోసారి వచ్చినప్పుడు వివరంగా చెప్తాగా. అన్నట్టు ఈ పది సంవత్సరాలు చాలాచిత్రంగా బ్రతికేసావు. పిసరంతా కూడా మార్పు రాలేదు. అన్నట్టు ఈ పది సంవత్సరాలు చాలా చిత్రంగా బ్రతికేసావు. పిసరంతా కూడా మార్పురాలేదు నీలో. ఎనభై ఏళ్ళు పైబడుంటాయి నీకు. ఇదే నీకు నాకు చివరి చూపులేమో...!"

"నేను చచ్చిపోతానంటావా మనవడా?!"

"ఎవరు చెప్పగలరు సుబ్బయ్యమ్మా, ఈ రోజుల్లో 80 ఏళ్ళు దాటి బ్రతికి బట్టకట్టిన వారెవరూ లేరు. సరిసరి ఈ 10 రూపాయలుంచుకో. అయినా నువ్వేం బాధపడకు. కంగారు పడకు. నీకేదైనా జరిగితే నేను వెంటనే వచ్చేలా ఇక్కడ ఏర్పాట్లు చేసుకున్నానులే! ఏమిటో... ఈ బంధం - నువ్వు నాకు దగ్గరదానిలా కనిపిస్తున్నావ్"!

○ ○ ○

5

మరో 10 సంవత్సరాలు హరించుకుపోగా...

ధర్మారావు సరికొత్త టాటాసుమోలో దిగాడు.. ఫ్యామ్లీతో!

రామచంద్రపురం బస్టాండు చాలా మారి పోయింది. చుట్టూ కలియతిరిగాడు. ఇదివరకటి షాపులు, షాపుఓనర్లు ఎవ్వరూ లేరు! వివరిస్తే చాలామంది కాలగర్భంలో కలిసిపోయినట్టు తెలిసింది. ఆ కరెంటు పోల్స్, బడ్డీకొట్లు, తాటాకు పాకలు ఏమీ లేవిప్పుడు. దూరంగా గిరాటేసినట్లు జరిగిపోయాయి! వెతికి వెతికి సుబ్బయ్యమ్మ కూర్చున్న చోటుకి వెళ్ళాడు అందరితో ధర్మారావు.

"సుబ్బయ్యమ్మా, ఆరోగ్యం బాగుందా మామ్మా... నువ్వు కనిపిస్తావనుకోలేదు!"

"నా... మన...వడు... ధర్మా...రా... వు.. కదూ!"

"నీకు వయసొచ్చే కొద్దీ యవ్వనం వస్తున్నట్టుంది. బాగానే గుర్తుపట్టావ్. ఏమిటీ ఇలా పీకి పాదేసిన తాటి టెంకను విసిరేసినట్టు దూరంగా వచ్చిపడ్డావు?" ధర్మారావు పెద్దజోక్ పేల్చినవాడూ గట్టిగా నవ్వేసాడు.

"గవర్నమెంటోళ్ళు రేతిరికాడవచ్చి రోడ్డు వెడల్పు చేస్తున్నామని... బిల్డింగులు.. కొ..ట్టేసారు నాయనా... ఇదిగో .. ఇలా...చోటు దొరికింది. నాకిక్కడ. నువ్విలా గున్నావు మనవడా... సూసీ... పదేళ్ళు ఐనాది.

బ్రహ్మాండంగా ఉన్నాను. పాతిక లక్షలతో ఇల్లు కట్టాను. 5 లక్షల కారు కొన్నాను - 10 లక్షలతో పిల్లల్ని చదివించాను. వీళ్ళిద్దరూ ఇంజనీరూ, డాక్ట రూను. ఇదిగో తీసుకొచ్చాను. నిన్ను చూస్తా నన్నారు. ఇదిగో ఈ ఎండిపోయిన కొబ్బరి మట్టలాగున్న ఈ ముసలావిడ ఎవరనుకుంటున్నావ్... సుబ్బయ్యమ్మా... అహహా... ఈవిగ మా ఆవిడ గుణవతి! నీకన్నా ముస లిదొక్క అయిపోయింది కదూ! ఈవిడకు కీళ్ళు నొప్పులు. ఇంకా 90 జబ్బులు! నాకేమో మొన్న హార్ట్ ఎటాక్ కూడా వచ్చి రెండు లక్షలు పట్టుకుపోయింది. ఆఁ... రవిబాబు... మల్లికా, ఈ సుబ్బయమ్మ మామ్మా మీకు గుర్తుంది కదూ.. 30 ఏళ్ళు క్రితం మీ అమ్మని పెళ్ళిచూపులు చూడ్డానికి వెళ్తూ చూస్తాను. అప్పటికీ ఇప్పటికీ ఒకేలాగుంది. అదే చిత్రం! వేదాంతంగా నాకు దేవుడేదిక్కు అంటూ ధైర్యంగా బ్రతికేస్తుంది. చిత్రం అంటే ఇదే! ఒరేయ్ రవిబాబూ, అమ్మా మల్లికా ఈ మామ్మకు 90 దాటుంటాయి. ఫొటో తీసి మేగ్‌జైన్‌లో వేయించొచ్చు. మంచి కాప్షన్‌తో! మీరు ఆ పని మీదుండండి... ఊ కానివ్వండి" "సుబ్బయ్యమ్మా, మామ్మానాకిప్పుడు 50 దాటుంటాయి. జీవితంలో సాధించిన చోట సాధిం చాను. ఓడిపోయిన చోట ఓడిపోయాను.. తప్పదు లైఫ్ అంతే - వింటున్నావా?"

"వి...న.బడు...తుంది.. మనవడా..."

"మరి మేం వెళ్తున్నాం. ఈ 100 రూపాయి లుంచుకో.. ఇదిగో నీ కోసం గుణవతి ఒక చీర కూడా తెచ్చింది. ఎర్రంచు, ఆకుపచ్చ చీర ఎంత బాగుందో చూడు"

"నా కెందు...కుర...రా... ఇవన్నీ... మనవడా?!"

"మొహమాటపడకు - ఉంచుకో" టాటా సుమో ఎక్కి వెళుతూ.... తన ఫోన్ నెంబర్లున్న కొత్త విజిటింగ్ కార్డ్సు అక్కడ అరడజను మందికిచ్చాడు ధర్మారావు.

○ ○ ○

కాలం మరో అర్ధపుష్కరాన్ని మింగేసింది!

ఈ మధ్య అగ్నిప్రమాదంలో అక్కడ చాలా షాపులు కాలిపోగా సుబ్బయ్యమ్మ తనగూడుని వదిలి ఇంకో మూల దూరంగా ఉన్న ఒకే రేకుపై ఆధారం గల చెక్క షెడ్డులో తలదాచుకుంది!

## శ్రమజీవి

ఓ శ్రమ జీవి.
సౌందర్య గృహ నిర్మాణంలో
నీకు నీవే సాటి
సుతిమెత్తని చేతులెంత బాధించినా
బాధని మదిలో దాచుకుని,
నిత్య జీవన పోరాటంలో
లేని నవ్వుని పులుముకుని
మరో నిర్మాణం వైపు
బ్రతుకు సాగుటకై
పయనించే నీ జీవన గమ్యం,
శ్రమ జీవులకి ఆదర్శం.

-శ్రీవెన్నెల

# కవితా జలం

నిరాకార నీరు
అక్షయ పాత్రలో అక్షరాల్లా
కవితలా సాకారం
బిందువు సింధువైనట్లు
అనంత సృజనైన అక్షరం
ఎన్ని రూపాలో నీటికి
అన్ని నామాలూ, భావాలు కవితకు
పారే నీటిలా
ప్రవహించే కవిత
పలకరించే పచ్చదనం
నీటిలో నింగిలా
అక్షరాల్లో అనంత ప్రకృతి పారదర్శకం
కరుణించే నీటిలా
కరిగించే కవితలు
స్థిర, గమన కవితలా నీరు
భావోద్వేగ శిఖరం నుండి తేటనీటిలా కవిత
కడలి కడుపులో బడబానలం
కవిలా నిశ్చలం
దూరానికి నిబ్బరం
దగ్గరలో ఎగసిపడే కెరటాల హోరు
కనిపించి, కనిపించని చినుకు మూలంలా
వినిపించి, వినిపించని కోరికల గొంతులా
కవితాంకురాలు అంతరాంతరాల్లో
తడికి, మృదులకీ ఆర్ద్రతా నీరు
పరిమళించే అమ్మదనం, చెమ్మదనం కవిత
జీవానికి, ప్రాణానికి, దాహార్తికి నీరు
కాలానికి, శీలానికి, ఆర్తికి కవిత
కన్నీటి చుక్కలో పారే కారుణ్య కిరణాలు
సృజనాకాశంలో కవితా ఇంద్రధనుస్సులు
దహనాల్ని దహించే, ద్రవించే
జంత్ర-మంత్ర, యంత్ర-తంత్ర కవితా జలంతో
హరిత వనాలై ఎడారి హృదయాలు
సారవంతమైన బంగారు బంజరులు

**-లలితానంద్**

ఆ రామచంద్రాపురం బస్టాండులో టాటా సుమో దిగిన ధర్మారావు ఒక్కడూ.... చేతికర్ర సహాయంతో నడుస్తూ.... సుబ్బయమ్మ కోసం వెతుకుతున్నాడు అన్నీ వెతికి ఎందర్నో అడిగి చివరికి సుబ్బయమ్మని సమీపించాడు.

"మామ్మా, సుబ్బయ్యమ్మా, ఏ ం... అలా నీరసంగా పడున్నావ్?" ధర్మారావు మాట కూడా నీరసంగా నిస్సత్తువుగానే ఉంది.... వయసు భారంతో ఆయాసంతో ఉన్నట్టున్నాడు.!

"రా...ధ...ర్మారావు మనవడా, కూర్చోలేక పోతున్నాను" పెదాలు కదవలేని స్థితిగా మాట్లాడిందామె.

"నువ్వెలా బ్రతుకుతున్నావో నాకర్థం కావటం లేదు. నా భార్య కేన్సర్‌తో చనిపోయి చాలా కాలా మైంది. పిల్లలిద్దరికీ పెళ్ళిళ్ళయ్యాయి. వాళ్ళకీ పిల్లలు పుట్టారు. మా అత్తగారింటి దగ్గర మా ఆవిడ పేరనున్న పొలం అమ్మి డబ్బు తీసుకెళ్దామని నేనిప్పుడొచ్చింది. ఇదే చివరిసారి చూడ్డం నాకు, ఇక ఇలా వచ్చేపని లేదసలు!"

"అలా... అనకు..రా.. మనవడా" నిన్ను చూస్తుంటే నా...కు కొత్తప్రాణం వస్తుంది"

"నీ మాటేమోగాని, నాకు మాత్రం చచ్చిపోవాల నుంది. ఇంకా బ్రతికి ఏం సాధించాలసలు?! జీవితం విరక్తిగా ఉంది. ఎన్నాళ్లు బ్రతికినా ఇదే బ్రతుకు – వెధవ బ్రతుకు! కూతురు, అల్లుడు నా గుమ్మం తొక్కనన్నారు. 'కొడుకు, కోడలూ చూసీ చూడనట్టు చూస్తున్నారు. మూడు బంగళాలు సంపాదించాను... వేస్ట్! పొలాలు, డిపాజిట్లు, బంగారాలు, ఫ్యాక్టరీలో వాటాలు... ఎందుకివన్నీ శుద్ధ దండగ!! ఏం చేసుకుంటాను... ఒక్కసారే తినేస్తానా? ఖర్మ అనుభవించేస్తున్నాను. నువ్వే నయం, హాయిగా, ఆనందంగా, ఆరోగ్యంగా ఉన్నావు. నిన్ను చూస్తుంటే నాకు కుళ్ళుమోతుతనం వచ్చేస్తుంది. జ్వరం వస్తే నన్ను పలకరించే దిక్కులేదు. మంచినీళ్ళు కావాలంటే అందించే నా అనే తోడులేదు. ఖర్మ ఖర్మ!! ఈ చెక్క షెడ్డులోనే ఇక్కడే, నీతోనే ఉండాలనిపిస్తుంది నాకు!!" ఏడుస్తూ అన్నాడు ధర్మారావు.

భుజం మీద చేయివేసి ఓదార్చింది సుబ్బయ్యమ్మ.

"నాకు తెలుసుండీ ఇంచుమించు 3 పుష్కరాలుగా బ్రతికెయ్యటం... నేనర్థం చేసుకోలేక పోతున్నాను.. కొన్ని జన్మల నుదుటివ్రాతలు ఆ దేవుడు....సంతుష్టిగా భోజనం చేసాక ఆనందంగా రాస్తాడోమే!!!!

"ఈ 200 రూపాయలు నీ దగ్గరుంచుకో. నే వెళ్తా. చివరగా నేనోమాట అడుగుతాను. నిజం చెప్తావా? ఆనందంగా ఉండడానికి.... నువ్వేం చేస్తుంటావ్?!"

ముసిముసిగా నవ్వింది సుబ్బయ్యమ్మ.

"సమాధానం చెప్పు నవ్వకు..."

"ఆ... పై... వాడు... ఏదిపెడితే... అది ... తింటాను... పెట్టక...పోతే... పస్తు!!"

"సరే, నువ్వు నిజం చెప్పవని నాకు తెలుసులే"

○ ○ ○

7

చాలా సంవత్సరాల తర్వాత ... ఆరోజు... కోటిపల్లి తాతగారింటికి వెళ్ళడానికి రామచంద్రాపురం బస్టాండులో ఆగాడు ధర్మారావు కొడుకు రవిబాబు.. కొత్త ఫారిన్ కారులో.

40 ఏళ్ళుగా అతను చూస్తున్న ప్రదేశమయినా గుర్తు పట్టలేని మార్పు! అంతకుముందు వారమే వచ్చిన పెనుతుఫానుతో ఆ ప్రదేశమంతా కొట్టుకు పోయినట్టుంది" చాలా ఇళ్ళు కూలిపోయాయి. అతికష్టం మీద వెతికివెతికి దూరంగా పొదల్లో పెద్ద సిమెంటు తూరలో ముడిచిపెట్టి నీరసంగా వణుకుతూ కూర్చున్న సుబ్బయ్యమ్మని సమీపించాడు రవిబాబు.

"బాగున్నావా మామ్మా... సుబ్బయ్యమ్మా...?"

" ఎ...వ....రు... ను...వ్వు??..."

"ధర్మారావుగారబ్బాయి రవిబాబుని. నువ్వు చచ్చిపోతావనుకున్నాడు మానాన్న! నీ కన్నాముందే ట్రైన్ ఏక్సిడెంటులో 3 ఏళ్ళక్రితమే నాన్న చచ్చిపోయాడు!! శవాన్ని మేం గుర్తించి ఇంటికి తీసుకు రాలేక పోయాం! లక్షల రూపాయల ఆస్తి ఉన్నా చివరికి దిక్కులేని చావే! మాయ!! వందేళ్ళు దాటి హాయిగా బ్రతుకుతున్నావు నువ్వు!! చాలా సంతోషం! రోగాలు, రొష్టులూ, విపత్కర పరిస్థితిలు నీకు భయపడి దూరంగా ఉండటమే నువ్వు చేసుకున్న పుణ్యం తాలూకు జీవితపు హాయి! డబ్బు, హోదాదేముంది... ఈవేళంది రేపు మోసగించే ఇంద్రజాలాలవి! నా అదృష్టం బాగుండీ ఈరోజు కన్పించావు. ఇంకో చిత్రం... నాన్నకు నాకూ అర్థమయ్యేది కాదు... నీ విషయం. మా రూపాలు మారుతున్నా 40 ఏళ్ల పాటు మాకిద్దరికీ నువ్వు మాత్రం శారీరక మార్పులేకుండా, 'ఒకే రూపం'లో కన్పించడం!!

ఏమిటి ఏడుస్తున్నావ్ మామ్మా.... నాన్న చచ్చిపోయాడని చెప్పాననా..."

"నా... మ...నవడు... ధర్మారా...వు... చచ్చిపోయాడా!! అయ్యో... అయ్యో...."

ఒక్కో అక్షరం కష్టంగా పలుకుతూ... మూలుగుతూ అంది సుబ్బయ్యమ్మ.

"నువ్వేం కంగారు పడకు. ఇక్కడకు వచ్చీరావటం తోనే నా ఫోను నెంబరు అందరికీ ఇచ్చాను. నీకేదైనా అయితే... నేను వస్తాను.. ఆ 'కార్యక్రమం' దగ్గరుండి నేను పూర్తి చేస్తాను. నువ్వేం దిగులు పడకు.

"అవును. నాన్న నీకుమనవడు. నేను నీకు మునిమనవడిని! నా పిల్లలు మునిమునిమనవలు!! బాధపడకు. కళ్ళు తడుచుకో - ఏం చేస్తాం... కాలం చేసే గారడీ!! మనిషి అన్నీ సాధించగలడు. ఒక్కటి మాత్రం ఎప్పటికీ సాధించలేడు సుబ్బయ్యమ్మా... అదే... తన 'చావు ముహూర్తం' తెలుసుకోవటం!"

రవిబాబు ఆమె చేతిలో డబ్బు పెట్టాలని ప్రయత్నించాడు.

అతని జేబులోంచి చేయి పైకి రాలేదు. కళ్ళు మూసి తెరవలేదు!! శ్వాస పీల్చి వదలలేదు!!

అక్కడి వాళ్ళు డాక్టరుని పిలిచారు.... అప్పటికే అతని ప్రాణాలు గాలిలో కలిసి పోయాయి! అతనిచ్చిన ఫోన్ నెంబరుతో ఫోన్‌చేయగా... రవిబాబు బంధువులు వచ్చి అతని శవాన్ని కొత్త ఫారిన్ కారులో ఎక్కించారు. ఆ కారు... గాలిలో దూసుకుపోయి... కనుమరుగైంది!

చిత్రాతిచిత్రం సుబ్బయ్యమ్మ చూస్తూ... రెండు కన్నీటిబొట్లు కార్చి అక్కడున్న చెట్టు మొదలుకు జారబడి.... నిస్సత్తువలో, మగతగా, కళ్ళు మూసుకుని,. ఆమె మూసిన కళ్ళెదుట....

రకరకాలబొమ్మలు... రంగు రంగుల బొమ్మలు...!

దేవుడు తయారుచేసి భూలోకంలోకి వదిలిన ప్రాణమున్న బొమ్మలు!!

అందులో కొన్ని...

క్రిందపడక పోయినా - వాట్లకవే బీటలు వారి పగిలి పోతున్నాయ్!

కొన్ని పర్వతం మీదనుండి ధబేలున క్రింద పడినా .... పగలటం లేదు!!

కొన్ని నీడపాటుకే రంగు వెలసి వెలవెల బోతున్నాయ్!

కొన్ని మండుటెండలో ఉండే కొలదీ... కాంతిలో ప్రకాశిస్తున్నాయ్!!

ఇంకొన్ని తారాజువ్వల్లా ఆకాశానికెగిరి మహారాజ వైభోగంగా నృత్యం చేస్తున్నాయ్!

మరికొన్ని.... వానపాముల్లా పాతాళ పొరల్లోకి కుంచించుకుపోతూ.... కూరుకుపోతున్నాయ్!! ■